వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 250
పేజీలు : 08 | వెల: రూ.5/-
శనివారం
జూలై 05, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



8లో..

## అది ఫేక్ లేఖ

- మంత్రి సీతక్కపై ఎలాంటి లేఖ విడుదల చేయలేదు
- దామోదర్ లొంగిపోతాడనేది బూటకం
- మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్

# కదిలిన.. జగన్నాథ రథచక్రాలు

- బలరాముడు, సుభద్ర దేవిలతో కలిసి జగన్నాథుడి దివ్య దర్శనం
- వేలాదిగా హాజరైన భక్తులు
- హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలో ప్రారంభం
- ముగ్గులు వేస్తూ స్వాగతం పలికిన భక్తులు
- కన్నుల పండువగా సాగిన యాత్ర
- రాత్రి వేంకటేశ్వర గార్డెన్స్‌లో ప్రత్యేక కార్యక్రమాలు

ఓరుగల్లులో జగన్నాథ స్వామి రథచక్రాలు కదిలాయి. హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన ఈ రథయాత్ర కన్నుల పండువగా సాగింది. సాక్షాత్తు దేవదేవుడి ప్రతి రూపంగా భావించే జగన్నాథ స్వామి దర్శనానికి భక్తులు వేల సంఖ్యలో తరలి వచ్చారు. వరంగల్ ఇస్కాన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ రథయాత్ర ప్రపంచంలోనే అత్యంత ప్రఖ్యాతిగాంచిన ఒరిస్సాలోని పూరీ జగన్నాథ రథయాత్రను తలపించడంతో భక్తులు తన్మయత్వంతో ఉప్పొంగారు. జగన్నాథ స్వామి నామ స్మరణతో ఆ ప్రాంతమంతా మారుమ్రోగింది. మహిళలు రహదారి వెంట ముగ్గులు వేస్తూ స్వామి వారికి స్వాగతం పలికారు. సోదరుడు బలరాముడు, సోదరి సుభద్ర దేవిలతో కలిసి ఊరేగుతున్న జగన్నాథుడి దివ్య దర్శనానికి భక్తులు ఎగబడ్డారు. పబ్లిక్ గార్డెన్ నుంచి ప్రారంభమైన రథయాత్ర హనుమకొండ చౌరస్తా, కాకతీయ మెడికల్ కళాశాల, ఎంజీఎం, గోపాలస్వామి గుడి, పోచమ్మమైదాన్ వరకు సాగి అక్కడే యూటర్న్ తీసుకొని ఎంజీఎం మీదుగా వేంకటేశ్వర గార్డెన్ చేరుకుంది. ఇక్కడే జగన్నాథుడు నూతన వస్త్రాలలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం భక్తులందరికీ చప్పన్ భోగ నైవేద్యాలు ప్రసాదంగా పంపిణీ చేశారు.

– వరంగల్ వాయిస్, హనుమకొండ




వివరాలు2లో..



8లో..

## ఆదర్శంగా నిలవాలి

- అన్ని వార్డుల్లో కంపోస్టు యూనిట్ లు ఏర్పాటు చేయాలి
- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- సానిటేషన్, మలేరియా విభాగం అధికారులతో సమీక్ష



## పదో రోజుకు చేరిన శాకంబరి

- నీలా క్రమంలో అమ్మవారి దర్శనం

వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శాకంబరీ నవరాత్ర మహోత్సవములు శనివారం పదో రోజుకు చేరుకున్నాయి. జ్యోతిశ్శాస్త్రం ప్రకారం దశమీ తిథికి అధిదేవత యముడు. ఈ తిథికి దశమహావిద్యలలోని కాళి క్రమాన్ని అనుసరించి నీలా క్రమంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈమె యముని యొక్క సంహార శక్తి. ఈమెను ఆరాధించిన వారిని మృత్యువు బాధించదు. ఈమె భక్తులు దీర్ఘమైన ఆయుష్మును కలిగి ఉంటారు. ఈతి బాధలు ఈమె భక్తుల దరిచేరవు. ఇహపర సౌఖ్యాలను ఈ నీలా అమ్మవారు ప్రసాదిస్తుంది. అట్లాగే షోడశీ క్రమాన్ని అనుసరించి ఈ రోజుకు అధిదేవత నిత్యా క్రమంలో భక్తులకు దర్శనమిచ్చారు. శాశ్వతమైన ఆనందాన్ని ఈ మాత ప్రసాదిస్తుందని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శేషుభారతి శ్రీ భద్రకాళి దేవస్థానంలోనే తిష్ఠవేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టారు. - **వరంగల్ వాయిస్, వరంగల్**

# కదిలిన..
# జగన్నాథ రథచక్రాలు

- బలరాముడు, సుభద్ర దేవిలతో కలిసి జగన్నాథుడి దివ్య దర్శనం
- వేలాదిగా హాజరైన భక్తులు
- హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలో ప్రారంభం
- ముగ్గులు వేస్తూ స్వాగతం పలికిన భక్తులు
- కన్నుల పండువగా సాగిన యాత్ర
- రాత్రి వేంకటేశ్వర గార్డెన్స్ లో ప్రత్యేక కార్యక్రమాలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రపంచంలోనే అత్యంత ప్రఖ్యాతిగాంచిన రథయాత్రల్లో పూరీ జగన్నాథ యాత్ర అతి ముఖ్యమైనది. ఒడిశా రాష్ట్రంలోని పూరీలో ఉన్న జగన్నాథ ఆలయంలో ప్రతి సంవత్సరం ఆశాడ మాసంలో కన్నుల పండువగా రథయాత్ర జరుగుతుంది. అంగరంగ వైభవంగా సాగనున్న ఈ యాత్రలో పాల్గొనేందుకు దేశ విదేశాలనుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. ఈ రథ యాత్రలో జగన్నాథుడితోపాటు సోదరుడు బలభద్రుడు, చెల్లెలు సుభద్రల విగ్రహాలను భారీ రథాలపై ఏర్పాటు చేసి పుర వీధుల్లో ఊరేగిస్తారు. ఈ రథయాత్ర జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర తమ ప్రధాన ఆలయం నుంచి గుండిచా ఆలయానికి (మేనత్త ఇల్లు) వెళ్లే ప్రయాణాన్ని సూచిస్తుంది. గుండిచా ఆలయాన్ని జగన్నాథ దేవుడి అత్తగారి ఇల్లుగా భావిస్తారు.

### మోక్షప్రాప్తి..

భక్తులు జగన్నాథుడి రథయాత్రలో పాల్గొనడంతోపాటు రథానికి ఉన్న తాడును లాగడం ద్వారా భక్తులు మోక్షాన్ని పొందుతారని ప్రగాఢమైన విశ్వాసం. ఈ జగన్నాథుడి పండుగ మత, సాంస్కృతిక ఐక్యతను, సమానత్వాన్ని సూచిస్తుంది. ఇదే తరహాలో వరంగల్ ఇస్కాన్ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన రథయాత్రకు ప్రజలనుంచి, భక్తులనుంచి విశేష స్పందన లభించింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు జగన్నాథుడి రథయాత్రలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులయ్యారు.



### 10 కిలో మీటర్లు..

ఓరుగల్లులో చేపట్టిన జగన్నాథ రథయాత్ర మొత్తం 10 కిలో మీటర్లు సాగింది. హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ నుంచి మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన రథయాత్ర సాయంత్రం 6 గంటలకు వేంకటేశ్వర గార్డెన్స్ కు చేరుకుంది. ఈ రథయాత్ర హనుమకొండ చౌరస్తా, కాకతీయ మెడికల్ కళాశాల, ఎంజీఎం, గోపాలస్వామి గుడి, పోచమ్మమైదాన్ వరకు సాగి అక్కడే యూటర్న్ తీసుకొని ఎంజీఎం మీదుగా వేంకటేశ్వర గార్డెన్ కు చేరుకుంది.

### భక్తులకు దర్శనాలు..

వేంకటేశ్వర గార్డెన్స్ కు చేరుకున్న జగన్నాథ స్వామి, సోదరుడు బలరాముడు, సోదరి సుభద్ర దేవిలకు నూతన వస్త్రములను అలంకరించారు. అనంతరం స్వామి వార్ల దివ్య దర్శనానికి భక్తులు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా భక్తులకు చప్పన్ భోగ నైవేద్యాన్ని ప్రసాదంగా పంపిణీ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో వేంకటేశ్వర గార్డెన్స్ కిటకిటలాడింది. కాలు పెట్టేందుకు కూడా సందు లేని పరిస్థితి నెలకొంది.




### 460 ఏళ్ల క్రితం చరిత్ర..

జగన్నాథ రథయాత్ర ప్రస్తావన బ్రహ్మ పురాణం, పద్మ పురాణం వంటి పురాతన గ్రంథాలలో కనిపిస్తోంది. ఇది 460 సంవత్సరాలకు పైగా పురాతనమైనదని నమ్ముతారు. జగన్నాథ రథయాత్ర గురించి అనేక ఇతిహాసాలు ఉన్నప్పటికీ, ప్రసిద్ధమైన వాటిలో ఇది ఒకటి. పూరి జగన్నాథ ఆలయాన్ని ఇంద్రద్యుమ్న రాజు నిర్మించాడు. జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర విగ్రహాలను గుండిచ ఆలయంలో విశ్వకర్మ తయారు చేశాడు. రాణి గుండిచ ఇంద్రద్యుమ్న భార్య. రాణి గుండిచకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం, ప్రతి సంవత్సరం రథయాత్ర సమయంలో దేవతలు గుండిచా ఆలయం సందర్శిస్తారు. పురాణాల ప్రకారం, ఇంద్రద్యుమ్న రాజుకు ఒక కల వచ్చింది. అందులో జగన్నాథుడు కనిపించి ఒడ్డున దొరికే చెక్క దుంగ నుంచి తన విగ్రహంను తయారు చేయాలని కోరుకున్నాడు. రాజు ఆ దుంగను చూసి విగ్రహాలను చెక్కడానికి తగిన మనిషి కోసం ఎదురుచూస్తున్నాడు. అయితే, అతనికి తగిన వారు ఎవరూ దొరకలేదు. అప్పుడే, విశ్వకర్మ విగ్రహాలను తయారు చేయడానికి అంగీకరించాడు. కానీ, అతను ఒక షరుతు పెట్టాడు. విగ్రహాలను తయారుచేసేప్పుడు ఎవరు చూడకూడదని, తలుపులు మూసివున్న గదిలో విగ్రహాలను తయారు చేస్తానని, విగ్రహాలు పూర్తయ్యే వరకు ఎవరినీ లోపలికి అనుమతించనని చెప్పాడు. అయితే, రాజు మొదట్లో అంగీకరించాడు. కానీ, తరువాత ఆందోళన చెంది తలుపు తెరిచాడు. దీంతో విశ్వకర్మకు కోపం వచ్చి ఆ ప్రదేశం నుంచి వెళ్లిపోయాడని, అలా విగ్రహాలు అసంపూర్ణంగా మిగిలిపోయాయని పురాణాలు చెబుతున్నాయి. అయితే, విగ్రహాలు అసంపూర్ణంగా ఉన్నప్పటికీ, నేటికీ వాటిని ఆ రూపంలోనే పూజించడం ఆనవాయితీగా వస్తోంది.

## అవయవ దానంపై అవగాహన పెరగాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ వాయిస్, వరంగల్ :** అవయవ దానంపై ప్రజల్లో అవగాహన పెరగాలని, మరొకనిరి పునర్జన్మను ఇవ్వడానికి జీవన్ దాన్ మహాదానమని గుర్తించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. శనివారం తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ వరంగల్ శాఖ, టీ 9 ఛానల్ సంయుక్త ఆధ్వర్యంలో వరంగల్ పట్టణంలోని ఆబ్నస్ ఫంక్షన్ హాల్ లో నేత్ర, అవయవ, శరీర దానంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా పాల్గొని, అతిథులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ అవయవ దానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. సమాజానికి మంచి చేయాలనే ఆలోచన కలగాలని, అవయవ దానంతో మరికొందరి జీవితాలలో వెలుగు నింపవచ్చునని, దీనిపై ప్రజల్లో ఇంకా అవగాహన కలగాలని చెప్పారు. అవయవదానం చేసిన వారు మహాత్ములని, చిరంజీవులుగా మిగిలిపోతారని సూచించారు.





## కుడా వైస్ చైర్మన్ గా చాహత్ బాజ్ పాయ్

### శుభాకాంక్షలు తెలిపిన అధికారులు, సిబ్బంది

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బల్దియా కమిషనర్ గా కొనసాగుతున్న చాహత్ బాజ్ పాయ్ ను కుడా వైస్ చైర్మెన్ గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఆమె బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కుడా అధికారులు, సిబ్బంది వైస్ చైర్మెన్ కు పుష్పగుచ్ఛాలు, పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



## ఆడెపు మహేందర్‌కు ఘన నివాళి

- దశదినకర్మకు హాజరైన పాత్రికేయులు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** దివంగత సీనియర్ జర్నలిస్ట్, ది హన్స్ ఇండియా వరంగల్ బ్యూరో చీఫ్ ఆడెపు మహేందర్ దశదినకర్మ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆరేపల్లి సమీపంలోని వీకే గార్డెన్ లో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, బంధుమిత్రులు, సహచర జర్నలిస్టులు హాజరై మహేందర్ ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, పూర్వ అధ్యక్షులు పిన్న శివకుమార్, గడ్డం కేశవమూర్తి, ఐజేయూ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, పాత్రికేయులు గోకారపు శ్యాం, సిరిమల్లె సదానందం, సంపతి ప్రభాకర్, ఉసనగిరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేందర్ సతీమణి ఆడెపు లావణ్య, కుమారుడు సిద్ధార్థ్ లను పరామర్శించారు. మహేందర్ తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ పిన్న శివకుమార్ భావోద్వేగానికి గురయ్యారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామంటూ హామీ ఇచ్చారు. జిల్లా రెవెన్యూ అధికారి వైవీ.గణేష్ పాల్గొని నివాళులర్పించారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శనివారం, జూలై 05, 2025

# కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త సమ్మె

**● సీఐటీయూ మండల కన్వీనర్ నాగరాజు**



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి:** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, లేబర్ కోడ్‌ల రద్దును డిమాండ్ చేస్తూ జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు ఇచ్చిన పిలుపు మేరకు జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ పొదల నాగరాజు కార్మికులకు పిలుపునిచ్చారు. శనివారం రఘునాథపల్లి మండలం అశ్వారావుపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్మికులు, ఆశా వర్కర్లు, ఆటో యూనియన్ నాయకులతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని ఆరోపించారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని విమర్శించారు. ఈ లేబర్ కోడ్‌ల ద్వారా కార్మికుల 8 గంటల పనిని 12 గంటలకు పొడిగించి, పని భారం పెంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను, కార్మిక హక్కులను కాపాడుకునేందుకు జాతీయ కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్లు కలిసి జులై 9న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయని ఆయన తెలిపారు. మండలంలోని సంఘటిత, అసంఘటిత, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులందరూ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు యాదలక్ష్మి, కుర్ర మాధవి, పొన్నగంటి అనిత, గ్రామ పంచాయతీ కార్మికులు పొనగంటి రామచంద్రు, తాళ్లపల్లి రామల్లయ్య, కొలెపాక రాజశేఖర్, ఆటో యూనియన్ నాయకులు తూరుకొండ అశోక్, తూర్పుకొండ నవీన్, తూరుగొండ కృష్ణ, జూలూరి వేణు తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికులకు రుణమాఫీ

**లక్షకు పైబడిన మొత్తాన్ని జులై 9లోగా చెల్లించాలి**

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** తెలంగాణ ప్రభుత్వం చేనేత కార్మికులకు శుభవార్త అందించింది. రూ. లక్ష వరకు వ్యక్తిగత రుణాలను మాఫీ చేసే పథకాన్ని ప్రకటించింది. ఈ రుణమాఫీ పథకం కింద 2017 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు చేనేత కార్మికులు తీసుకున్న వ్యక్తిగత రుణాలు మాఫీ చేయబడతాయి. ప్రభుత్వ జీవో నెంబర్ 56, తేదీ 09.03.2025 (పరిశ్రమలు, వాణిజ్య శాఖ) చేనేత జౌళి శాఖ కమిషనర్, హైదరాబాద్ వారి ఉత్తర్వుల ప్రకారం ఈ పథకం అమలులోకి వచ్చింది. వివిధ బ్యాంకుల నుంచి చేనేత కార్మికులు తీసుకున్న రుణాల వివరాలను ఇప్పటికే ప్రత్యేక ఫార్మాట్లలో సేకరించారు. చేనేత జౌళి శాఖ అధికారులు ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఈ వివరాలను పరిశీలిస్తున్నారు. జిల్లాలోని చేనేత కార్మికులకు చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు ఒక ముఖ్య విజ్ఞప్తి చేశారు. 2024 మార్చి 31 నాటికి రూ. లక్షకు పైగా రుణం ఉన్న చేనేత కార్మికులు, ఆ అదనపు మొత్తాన్ని 2025 జూలై 9 లోగా తమ రుణ ఖాతాలకు జమ చేయాలి. ఈ వివరాలను సంబంధిత జిల్లా కార్యాలయంలోని సహాయ సంచాలకులు, చేనేత, జౌళి శాఖకు అందజేయాలని సూచించారు. అదనపు మొత్తం చెల్లించిన వారి ప్రతిపాదనలను జిల్లా స్థాయి కమిటీలో ఆమోదించి, ప్రభుత్వానికి పంపడం జరుగుతుంది. ఈ అవకాశాన్ని జిల్లాలోని చేనేత కార్మికులందరూ సద్వినియోగం చేసుకోవాలని చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు కోరారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**వెంకటాపూర్ తహసీల్దార్ గిరిబాబు**



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్:** విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వెంకటాపూర్ తహసీల్దార్ గిరిబాబు అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం ఆయన మండలంలోని రామాంజపూర్ శివారులోని చెంచుకాలనీలో గల బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పాఠశాల విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం పాఠశాల పరిసరాలను కలియతిరిగి పరిశుభ్రతను తనిఖీ చేశారు. మధ్యాహ్నం గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనం చేసి, భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. వర్షాకాలంలో పిల్లలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని, విషయాన్ని కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్తామని హెచ్చరించారు. పౌష్టికాహారంతో పాటు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, విద్యార్థులు జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు ముందస్తుగా వైద్య పరీక్షలు నిర్వహించాలని తహసీల్దార్ గిరిబాబు పేర్కొన్నారు. ఈ తనిఖీలో తహసీల్దార్ వెంట ఆర్ఐ విజేందర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె నోటీసు



**వరంగల్ వాయిస్, కామారెడ్డి:** జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ జులై 9న ఇందిరాపార్కు వద్ద జరిగే మహాధర్నాకు హాజరుకావాలని ఏఐటీయూసీ ట్రేడ్ యూనియన్, జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ మేరకు కామారెడ్డి డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్, బాన్సువాడ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మికి సమ్మె నోటీసు అందజేశారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు తమ డిమాండ్లను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఎన్‌హెచ్‌ఎంలో వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ, ఇతర రాష్ట్రాలలో రెగ్యులరైజ్ చేస్తున్న విధంగా, పదేళ్లు పూర్తి చేసుకున్న వారందరినీ రెగ్యులరైజ్ చేయాలి, 2018 నుంచి 510 జీవో ద్వారా నష్టపోయిన ఎన్‌హెచ్‌ఎం ఆల్ క్యాడర్స్ ఉద్యోగులందరికీ క్యాడర్ ఫిక్సేషన్ చేసి బేసిక్ పే అమలు చేయాలి,2018లో పీఆర్సీ విడుదల చేశారు. దానికి సంబంధించిన 7 నెలల ఏరియర్స్ బకాయిలు చెల్లించాలి, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగం చేస్తూ రిటైర్ అయిన ఉద్యోగులకు రూ. 10 లక్షల బెనిఫిట్స్ ఇవ్వాలి. వారికి జీవనోపాధి కోసం పింఛను సదుపాయం కూడా కల్పించాలి, బస్తీ దవాఖానలలో 2018/2019 సంవత్సరాలలో కాంట్రాక్ట్ విధానంలో నియమకమైన సపోర్టింగ్ స్టాఫ్‌ను ఏజెన్సీలకు అప్పగించడాన్ని నిలుపుదల చేసి, తిరిగి వారిని కాంట్రాక్ట్ విధానంలోనే కొనసాగించాలి, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగి ఎవరైనా చనిపోతే తక్షణమే ఖర్చులకు రూ. 20 వేల నగదును ప్రభుత్వం తరపున అందించాలి. రూ. 50 లక్షల సదుపాయాన్ని కల్పించి, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగాన్ని ఇవ్వాలి, ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలి, ఎన్‌హెచ్‌ఎం మహిళా ఉద్యోగులందరికీ 180 రోజులు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్ వన్ ప్రభలత, నర్సింగ్ ఆఫీసర్స్ జె. స్రవంతి, జి. స్రవంతి, సరోజ, సావిత్రి, శోభ, కవిత తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

**బీజేపీ నేత కుందూరు మహేందర్ రెడ్డి**



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట:** విద్యను వ్యాపారంగా మార్చి కోట్లు గడిస్తూ, మధ్యతరగతి పిల్లలకు ప్రైవేటు విద్యను అందని ద్రాక్షగా మారుస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై ప్రభుత్వ పర్యవేక్షణ కరువైందని, ఈ విషయంలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి, విద్యార్థులందరినీ ప్రభుత్వ పాఠశాలలకు తరలించి నాణ్యమైన విద్యను అందిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చలేదని మహేందర్ రెడ్డి మండిపడ్డారు. ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిని కూడా నియమించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన అన్నారు. ప్రైవేటు పాఠశాలలు విద్యను వ్యాపారంగా కాకుండా సేవగా భావించి, దేశ అభివృద్ధి కోసం పనిచేయాలని ప్రైవేటు విద్యాసంస్థల అధినేతలకు పిలుపునిచ్చారు. విద్య ప్రాథమిక హక్కు అని గుర్తించి, విద్యారంగాన్ని అభివృద్ధి పరిచే విధంగా పనిచేయాలని ఆయన అన్నారు.

# నిరుపేద పద్మశాలీ కుటుంబానికి చేయూతనిద్దాం

**దాతల సహాయం కోసం విజ్ఞప్తి**



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** నిరుపేద పద్మశాలి కుటుంబానికి చెందిన స్వర్గం రాజు (నేరేడుపల్లి గ్రామం, శాయంపేట మండలం, హనుమకొండ జిల్లా) నిన్న సాయంత్రం గుండెపోటుతో అకాల మరణం చెందారు. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి వారిది. నిత్యం కూలి పనులు చేసుకుంటేనే ఆ కుటుంబం గడుస్తుంది. రాజుకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. ఇంటి అడుగు స్థలం తప్ప, నివసించడానికి సరైన ఇల్లు కూడా లేని దుర్భర పరిస్థితి. వీరికి 10 సంవత్సరాలలోపు ఇద్దరు చిన్న పిల్లలు –కూతురు నాగచందన, కుమారుడు నగేష్ ఉన్నారు. అంతేకాకుండా, రాజు భార్య లలిత అనారోగ్యంతో బాధపడుతుండగా, తల్లి పక్షవాతంతో మంచాన పడి ఉన్నారు. ఈ దయనీయ పరిస్థితుల్లో ఉన్న ఆ కుటుంబానికి చేయూతనివ్వాలని పద్మశాలి పెద్దలు, కులబాంధవులకు విజ్ఞప్తి చేస్తున్నారు. దాతలు తమకు తోచిన సహాయం అందించి, ఆ చిన్నారులకు మేమున్నామనే భరోసా కల్పించాలని కోరారు. సహాయం అందించదలిచిన వారు పోరండ్ల చరణ్ ఫోన్‌పే నంబర్ 9399980737కు పంపగలరని కోరుతున్నారు.

# ఎమ్మెల్యే నాయినిని కలిసిన టీఎన్‌జీఓస్ నేతలు

**● ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి విజ్ఞప్తి**



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** టీఎన్‌జీఓస్ కేంద్ర సంఘ అధ్యక్షులు, జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో శనివారం ఉద్యోగ సంఘాల నేతలు వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డిని బాలసముద్రంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సమావేశంలో నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ తన నియోజకవర్గంలో ఉద్యోగ కుటుంబాలు అధికంగా ఉన్నాయని, వారందరికీ తాను నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. తాను ఉద్యోగుల కుటుంబ సభ్యుడిగానే వ్యవహరిస్తున్నానని, ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. మారం జగదీశ్వర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న రాజేందర్ రెడ్డికి అభినందనలు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని ఆయనను కోరారు. ఆకుల రాజేందర్ మాట్లాడుతూ, ఉద్యోగుల కుటుంబ సభ్యునిగా ఉంటూ, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న రాజేందర్ రెడ్డికి ఉద్యోగుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బైరీ సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికేల రాజేష్, గౌరవ అధ్యక్షులు శ్యాంసుందర్, కేంద్ర సంఘ నేత రాము నాయక్, రాగి శ్రీనివాస్, లక్ష్మి ప్రసాద్, నాలుగవ తరగతి ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు దాస్య నాయక్, జిల్లా నేతలు కత్తి రమేష్, ఆకుల రాజమౌళి, సురేష్, రామ్ ప్రసాద్, శ్రీనివాస్, పృథ్వి, రాజేష్ ఖన్నా, ములుగు జిల్లా అధ్యక్షులు పోలు రాజు, కార్యదర్శి మేడి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

4
WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శనివారం, జూలై 05, 2025

# పెట్టుబడిదారుల కోసమే లేబర్ కోడ్‌లు

◆ 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

◆ జాతీయ కార్మిక సంఘాల సంయుక్త సమావేశం




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కొత్త కార్మిక కోడ్‌లు పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమేనని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జక్కుల రాజుగౌడ్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి దయాకర్, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు మామిడి శ్యాంసుందర్ అన్నారు. శనివారం హనుమకొండ రామ్‌నగర్‌లోని సుందరయ్య భవన్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు టి. ఉప్పలయ్య, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు కూర వెంకట్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి అధ్యక్షతన జరిగిన జాతీయ కార్మిక సంఘాల సమావేశంలో వారు ఈ వ్యాఖ్యలు చేశారు. రాగుల రమేష్, రాజుగౌడ్, గంగుల దయాకర్, మామిడి శ్యాంసుందర్ మాట్లాడుతూ, కార్మికుల శ్రమను దోచుకొని, పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మిక చట్టాలను సులభతరం చేసి, కార్మికులను కట్టుబానిసలుగా మార్చడానికే ఈ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చారని విమర్శించారు. వాటిని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జూలై 9న జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు పలు డిమాండ్లను లేవనెత్తారు. 29 పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి, ఉపాధి హామీ పథకాన్ని పట్టణాలకు వర్తింపజేసి, 210 రోజుల పని దినాలు కల్పించి, రూ. 800 కూలీని పెంచాలన్నారు. జాతీయ సమ్మెను జయప్రదం చేయడంలో భాగంగా జులై 7వ తేదీ సోమవారం వెయ్యిస్తంభాల గుడి నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే, జులై 9న సమ్మెలో భాగంగా హనుమకొండ ఏకశిలా పార్కు నుండి కలెక్టరేట్ వరకు వేలాది మందితో కార్మిక మహా ప్రదర్శన నిర్వహిస్తామని, వేలాది మంది కార్మికులు, ప్రజలు పాల్గొనాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆలకుంట యాకయ్య, బానోతు వెంకన్న, ఎన్. ఓదెలు, మైముద్ ఖాన్, డి. భాను నాయక్ పాల్గొన్నారు.

## 7న పాత వస్తువుల వేలం

**వరంగల్ వాయిస్, మామునూర్:** మామునూరులోని 4వ పటాలం తెలంగాణ ప్రత్యేక పోలీస్ లైన్స్‌లో ఈ నెల జులై 7న ఉదయం 11 గంటలకు పాత వస్తువుల వేలం నిర్వహించబడుతుంది. ఈ వేలంలో అల్యూమినియం వంట పాత్రలు, ప్లాస్టిక్ కుర్చీలు, ఇనుప సామాను, ఆట వస్తువులు, ట్రైనింగ్ పరికరాలు, ప్రింటర్లు, బ్యారక్స్‌లో ఉపయోగించిన వస్తువులు, మోటార్ వెహికల్స్ స్పేర్ పార్ట్స్, బ్యాటరీలతో సహా వివిధ రకాల కాలపరిమితి ముగిసిన వస్తువులను వేలం వేస్తారు. ఆసక్తి గల వ్యక్తులు లేదా సంస్థలు ఈ వేలంలో పాల్గొనవచ్చు. ఈ వేలం ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా, పూర్తి పారదర్శకంగా నిర్వహింపబడుతుందని అధికారులు తెలిపారు. వేలంలో అధిక మొత్తాన్ని కోట్ చేసిన వారు సంబంధిత అధికారులకు నగదు రూపంలో చెల్లించి వస్తువులను తీసుకెళ్లవచ్చు. అయితే, దళాధిపతి, 4వ పటాలం టీజీఎస్‌పీ వారు ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండా ఈ వేలాన్ని ఏ దశలోనైనా రద్దు చేయడానికి లేదా తిరిగి నిర్వహించడానికి అధికారం కలిగి ఉంటారని గమనించగలరు.

## గురుపౌర్ణమి వేడుకల బ్యానర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, వరంగల్:** ఈ నెల 10వ తేదీ గురువారం గిర్మాజిపేటలోని జిట్టేడు హనుమాన్ దేవాలయం ఆవరణలో ధరణీసాయి సేవా సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 9వ వార్షిక గురుపౌర్ణమి వేడుకల బ్యానర్‌ను శనివారం ఉదయం ఆవిష్కరించారు. ఆలయంలో పూజల అనంతరం సంఘ సభ్యులు ఈ బ్యానర్‌ను ఆవిష్కరించారు. గురుపౌర్ణమి వేడుకల కార్యక్రమాలను నిర్వాహకులు జి. సుధాకర్, ఆర్. హరిప్రసాద్ వివరించారు. జులై 10న ఉదయం 4:15 గంటలకు నగర సంకీర్తన, 5 గంటలకు కాకడ హారతితో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఉదయం 7:30 గంటలకు సాయినాథునికి భక్తులచే పంచామృతాభిషేకం, ఉదయం 8 గంటలకు సంఘ సభ్యుల చేతుల మీదుగా వివిధ రకాల అభిషేకాలు జరుగుతాయి. మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న హారతి, అనంతరం 12:02 గంటలకు అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. సాయంత్రం 6:30 గంటలకు ధూప్ హారతి, 7 గంటలకు సాయి ప్రసాదంగా విశిష్ట సేవలు అందించిన వారికి చిరు సత్కారం, రాత్రి 8:30 గంటలకు శేజ్ హారతితో గురుపౌర్ణమి నాటి కార్యక్రమాలు ముగుస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

## పల్లా రాజేశ్వర్ రెడ్డిని పరామర్శించిన బీఆర్ఎస్ నేతలు



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి:** ప్రముఖ విద్యావేత్త, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, జనగామ శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డిని శనివారం రఘునాథపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. ఇటీవల ప్రమాదంలో గాయపడి చికిత్స పొంది ప్రస్తుతం హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న పల్లాను నేతలు కలిశారు. ఈ సందర్భంగా వారు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో జిల్లా నాయకులు కుర్ర రాజేందర్ నాయక్, మట్టపల్లి రాధాకృష్ణ, మహిళా నాయకులు మట్లపల్లి సునీత, విజయ, పెద్దగుని రాధ, మాలోతు హరి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన జంగా సుజాత



**వరంగల్ వాయిస్, కాజీపేట:** మండలంలోని టేకులగూడెం గ్రామంలో మాజీ కార్పొరేటర్ లింగం మౌనికా చరణ్ రెడ్డి కూతురు లింగం సిరి నూతన వస్త్రాలంకరణ కార్యక్రమంలో రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి సతీమణి జంగా సుజాత రాఘవరెడ్డి పాల్గొన్నారు. ఆమె చిన్నారి సిరిని ఆశీర్వదించారు.

## బాసర ట్రిపుల్ ఐటీకి డోర్నకల్ విద్యార్థిని ఎంపిక



**వరంగల్ వాయిస్, డోర్నకల్:** బాసర ట్రిపుల్ ఐటీకి డోర్నకల్ మండలం కన్నెగుండ్ల హైస్కూల్ విద్యార్థిని షేక్ షాహిద ఎంపికైనట్లు హెచ్ఎం అంగోత్ లక్ష్మ నాయక్ తెలిపారు. పాఠశాలలో షాహిదకు ఉత్తమ మార్కులు రావడంతో ఆమెను ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కన్నెగుండ్ల గ్రామానికి చెందిన విద్యార్థిని ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ప్రవేశాలకు తీవ్ర పోటీ ఉన్నప్పటికీ తమ విద్యార్థిని ప్రతిభతో నిలబడటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థినులు ఉన్నత స్థాయికి ఎదగడం ఉపాధ్యాయులకు ఎంతో ఆనందాన్ని ఇస్తుందని హెచ్ఎం అన్నారు. ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు సైతం షాహిదను ఆదర్శంగా తీసుకొని చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా టీచర్లు కోవిలా రాజేశ్వర్, మాధవరావు, వెంకన్న, శ్రీనివాస్, వెంకట్రామ నర్సయ్య, లోకేందర్ రెడ్డి, నాగమణి, ఉరియా, వాణిశ్రీ, రామకృష్ణ, దస్తగిరి, రామూర్తి, నరేందర్ తదితరులు షాహిదను అభినందించారు.

## పెండింగ్ స్కాలర్‌షిప్‌లు తక్షణమే విడుదల చేయాలి




**వరంగల్ వాయిస్, పరకాల:** తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.8,000 కోట్లకు పైగా స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ (స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) డిమాండ్ చేసింది. ఈ డిమాండ్‌తో శనివారం పరకాల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ మాట్లాడుతూ స్కాలర్‌షిప్ బకాయిలతో సంబంధం లేకుండా విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. పై చదువుల కోసం కౌన్సిలింగ్‌కు హాజరైనప్పుడు సర్టిఫికెట్స్ ఇవ్వడానికి ఇబ్బందులకు గురిచేసే కళాశాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్, ఎస్ఎఫ్ఐ నాయకులు సురేష్, మహేష్, విజయ్, కళ్యాణి, సుస్మిత, అరుణ, ప్రభులత తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికులకు పని భద్రత, కనీస వేతనం కల్పించాలి



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** తెలంగాణ వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులకు పని భద్రత, కనీస వేతనం లభించడం లేదని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మల రామ్మూర్తి అన్నారు. శనివారం ఆత్మకూరు మండల కేంద్రంలోని ఎంఆర్‌సి భవనంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల అధ్యక్షురాలు వైనాల విజయ ఆధ్వర్యంలో సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా రామ్మూర్తి మాట్లాడుతూ, గత రెండు దశాబ్దాలుగా మధ్యాహ్న భోజన కార్మికులుగా పనిచేస్తున్న వారికి పని భద్రత, కనీస వేతనం, ప్రమాద బీమా, సామాజిక భద్రతతో కూడిన పింఛను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26,000, పింఛను, ఈఎస్ఐ వర్తింపజేయాలని ఆయన కోరారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ఈ నెల 9లోగా పరిష్కరించకుంటే సమ్మె నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు వైనాల విజయ, ప్రధాన కార్యదర్శి అజ్మత్ బేగం, లక్ష్మి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీధర్ యాదవ్ భూమి పూజ



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** "ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు లేదు, సంక్షేమ పథకాలు చేరని గడప లేదు" అని 4వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాషబోయిన శ్రీధర్ యాదవ్ అన్నారు. శనివారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రేటర్ వరంగల్ 4వ డివిజన్‌లోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల భూమి పూజ కార్యక్రమంలో శ్రీధర్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడంతో సంతోషం వ్యక్తం చేసిన లబ్ధిదారులు, శ్రీధర్ యాదవ్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం శ్రీధర్ యాదవ్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇల్లు ప్రతి పేద కుటుంబానికి ఆశయంగా మారుతున్న ప్రజా ప్రభుత్వ సంకల్పం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొడాలి అనిల్, మహ్మద్ గౌస్, తేజ, నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి ఆపద్బాంధవునిలా ఆదుకుంటుంది

◆ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, శాయంపేట:** ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఆపద్బాంధవునిలా ఆదుకుంటుందని భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావు అన్నారు. శనివారం భూపాలపల్లి నియోజకవర్గంలోని శాయంపేట మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 23 మంది సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు రూ. 6,84,500 విలువైన చెక్కులను ఎమ్మెల్యే మండల కేంద్రంలోని రైతు వేదికలో అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలవడమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పేద ప్రజలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఆయన అన్నారు. సీఎం సహాయనిధి ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని, మానవతా దృక్పథంతో సీఎం రేవంత్ రెడ్డి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్య చికిత్సలు చేయించుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఎన్నో కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆసరాగా నిలుస్తుందని సత్యనారాయణరావు తెలిపారు. బాధితులు అవసరమైన సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్‌ను తప్పక సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ చల్ల చక్రపాణి, తహసీల్దార్ సత్యనారాయణరావు, ఏవో గంగా జమున, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నవోదయ ఆరో తరగతి ప్రవేశ పరీక్ష

దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

**వరంగల్ వాయిస్, మామునూరు:** వరంగల్ జిల్లా మామునూరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2026 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి. పూర్ణిమ తెలిపారు. దరఖాస్తులకు చివరి తేదీ జూలై 29, 2025 అని పేర్కొంటూ, ప్రవేశ పరీక్ష డిసెంబర్ 13, 2025న ఉంటుందని వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఏదైనా ఇంటర్నెట్ సెంటర్ నుంచి www. navodaya.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు సమయంలో అభ్యర్థి యొక్క ఫోటో, సంతకం, తండ్రి యొక్క సంతకం స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అన్ని డాక్యుమెంట్లు జేపీజీ ఫార్మాట్‌లో ఉండాలి. అభ్యర్థి చదువుతున్న పాఠశాల గ్రామీణ పరిధిలో ఉందా లేదా పట్టణ పరిధిలో ఉందా అనేది సంబంధిత అధికారిని సంప్రదించి ధృవీకరించుకోవాలి. అభ్యర్థి చదువుతున్న పాఠశాల ప్రాంతం మరియు తల్లిదండ్రుల నివాసం రెండూ ఉమ్మడి వరంగల్ జిల్లాలోనివై ఉండాలని స్పష్టం చేశారు. రిఫరెన్స్ ఐడీ, పాస్‌వర్డ్ కోసం అభ్యర్థి తండ్రి యొక్క ఫోన్ నంబర్ ఇవ్వాలి. అభ్యర్థికి ఆధార్ నంబర్ లేనిచో నిర్ణీత రెసిడెన్స్ సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయాలని సూచించారు. అభ్యర్థి 3, 4, 5 తరగతులు ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి ఉండాలని, ప్రస్తుతం 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదువుతూ ఉండాలని తెలిపారు. అభ్యర్థి 2014 మే 1వ తేదీ నుంచి 2016 జూలై 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలి. అభ్యర్థి పూర్తి విద్యా సంవత్సరాలు చదివి ఉండాలి. 5వ తరగతి ప్రస్తుతం ఏ జిల్లాలో చదువుతున్నారో తప్పనిసరిగా ఆ జిల్లాలోనే దరఖాస్తు చేయాలి. అభ్యర్థి పాఠశాల మండలం ఏ బ్లాక్ పరిధిలోకి వస్తుందో వెబ్‌సైట్‌లో చూసి ఎంచుకోవాలి. గతంలో నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసిన లేదా వ్రాసిన వారు అనర్హులుగా తెలిపారు.మరిన్ని వివరాలకు హెల్ప్‌లైన్ నంబర్లు 9110782213, 7993263431ను సంప్రదించవచ్చు.

# తెలంగాణ మైనారిటీ గురుకుల కళాశాలలో పలు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని మైనారిటీ గురుకుల పాఠశాల,యు కళాశాలలో వంట మనుషులు-1, దోబీ-1, స్వీపర్-1, ఎలక్ట్రీషియన్-1 పోస్టులను భర్తీ చేయుటకు అర్హత గల అభ్యర్థుల నుంmr దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమేష్ లాల్ హట్కర్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను బయోడేటాతో పాటు ఆధార్ కార్డు నకలు , రెండు ఫొటోలను నేరుగా పాఠశాలలో ఈ నెల 6 నుంచి 10 వరకు , పని దినాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటలలోపు సమర్పించాలని కోరుతూ , ఎలక్ట్రీషియన్ పోస్టుకు ప్లంబింగ్ నైపుణ్యం కూడా ఉండాలని తెలిపారు. సంప్రదించాల్సిన చిరునామా తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాల ఎస్బీఐ టి క్యాంపస్, శైలానీ బాబా దర్గా ప్రక్కన, ఒగ్లాపూర్. మరిన్ని వివరాలకు 9949300368, 7780167736,7995057981 నంబర్లలో సంప్రదించగలరని పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి. 30వ డివిజన్ ప్రెసిడెంట్ రమేష్, నాయకులు బొంత సారంగం ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నుండి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వీరిని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి బాలసముద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బొంత సారంగం, డివిజన్ అధ్యక్షులు వల్లెపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ ఫీజు రీయింబర్స్ మెంట్స్ విడుదల చేయాలి

■ ఎస్ఎఫ్ఐ వరంగల్ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్




**వరంగల్ వాయిస్, పోచమ్మ మైదాన్:** గత ఆరు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో శనివారం పోచమ్మైదాన్ సర్కిల్‌లో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ వరంగల్ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో గత ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్లు, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ బకాయిల వల్ల విద్యార్థులు, ప్రైవేటు యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వడ్డీలకు అప్పులు తెచ్చి విద్యాసంస్థలను నడపలేమని యాజమాన్యాలు పరీక్షలను బహిష్కరించాయని, మరోవైపు విద్యార్థుల నుండి పెండింగ్ ఫీజులను బలవంతంగా వసూలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ గత పాలకుల నిర్లక్ష్యాన్ని విమర్శించి, తాము అధికారంలోకి వస్తే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని మరింత పటిష్టంగా రూపొందించి బకాయిలు చెల్లిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత బకాయిలు విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని ప్రశాంత్ మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో 13 లక్షల మంది బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు పై చదువులకు వెళ్లాలంటే సర్టిఫికెట్స్ కోసం కళాశాలల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొన్ని కళాశాలలు కూడా ముక్కుపిండి వసూళ్లు చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఫీజు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగింపు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ వరంగల్ జిల్లా కమిటీ సభ్యుడు జిల్లా మహేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజేందర్, నితిన్, సుకుమార్, అన్వేష్, అభినయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# న్యాయవాది కలకోటి మహేందర్‌కు పరామర్శ



**వరంగల్ వాయిస్, కమలాపూర్:** ప్రముఖ న్యాయవాది, అసైన్డ్ భూమి సమితి (ఏబీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ అన్న కలకోటి రాజేందర్ శనివారం అనారోగ్యంతో అకాల మరణం చెందారు. ఈ నేపథ్యంలో పలు ప్రజా సంఘాల నాయకులు కలకోటి మహేందర్‌ను, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.ఈ సందర్భంగా రజక రిజర్వేషన్ పోరాట సమితి (ఆర్ఆర్పీఎస్) రాష్ట్ర చైర్మన్ చాపర్తి కుమార్ గాడ్గే ఆధ్వర్యంలో మృతదేహంపై నివాళులర్పించారు. అనంతరం చాపర్తి కుమార్ గాడ్గే మాట్లాడుతూ మంచికి మారుపేరుగా నిలిచిన కలకోటి రాజేందర్ మరణం ఎంతో బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్, దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, కళాకారులు వెన్నెల శ్రీనాథ్, గోల్కొండ బుచ్చన్న, దిక్కార కవి సత్య కలకోటి, నాయకులు నేరెళ్ల బస్వరెడ్డి, గడ్డం స్వామి, సందెల రవీందర్, చుంచు విజయేందర్ మోరె ఐలయ్య, మాదాసి శ్రీనివాస్, మాదాసి సుదర్శన్, గిన్నారపు మైబు, గిన్నారపు ప్రసంగి, మాదాసి సుధాకర్, కొలిపాక సురేష్, మాదాసి నవీన్ పాల్గొన్నారు.

# పడకేసిన రోడ్డు విస్తరణ పనులు

**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు పడకేయడంతో పలువురు పెదవి విరుస్తున్నారు. దీంతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు కూడా అటకెక్కింది. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కు ప్రతిష్టాత్మక కార్యక్రమమైన కార్యక్రమమైన ఇది గ్రామస్తులు సహకరించక పోవడం వల్లనే ఆగినట్లు అనుకుంటున్నారు. తొలుత అధికారులు రోడ్డు విస్తరణకు లిమిట్స్ దాటిన నిర్మాణాలను వెంటనే తొలగించాలంటూ సంబంధితులకు నోటీసులు ఇచ్చారు. దాంతో కొంతమంది తమ నిర్మాణాలను తొలగించుకున్నారు. ఈ క్రమంలో ఇంకా పలువురు తమ నిర్మాణాలను తొలగించుకోకపోవడంతో ముందుగా తొలగించుకున్న వారు తిరిగి మళ్లీ నిర్మాణాలు చేసుకుంటున్నారు. రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులు ముందుకు సాగకపోతే ఉండడంతో ఇక ఇవి ఇంతే సంగతులేనా..? అని ప్రశ్నిస్తున్నారు. అయితే ఎమ్మెల్యే జిఎస్సార్ మాత్రం ఈ పనుల్ని కొనసాగించేలా గట్టి పట్టుదలతో ఉన్నట్లు చెబుతున్నారు. ఈ మేరకు అధికారులకు, అధికార పార్టీ నాయకులకు వెంటనే పనుల్ని ప్రారంభించేలా ఆదేశాలు ఇచ్చినట్లు చెబుతున్నారు. త్వరితగతిన రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ విస్తరణ పనులు చేపట్టి పూర్తి చేసి గణపురానికి కళను తేవాలని గ్రామంలోని పలువురు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేస్తున్నారు.

# బాధ్యతాయుతంగా ప్రజలకు సేవలందించాలి

వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్



**వరంగల్ వాయిస్, క్రైం:** ప్రజలకు బాధ్యతాయుతంగా సేవలందిస్తే సమాజంలో పోలీసుల పట్ల గౌరవ మర్యాదలు పెరుగుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ (సీపీ) పేర్కొన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ)లుగా పదోన్నతి పొందిన పి. శ్యాం సుందర్, ఎస్. ప్రభాకర్, టి. కట్టస్వామి, వి. శంకర్, ఏ. అర్జున్‌లు శనివారం సీపీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ తన చేతుల మీదుగా పదోన్నతి పొందిన అధికారుల భుజాలపై నక్షత్రాలను అలంకరించి అభినందనలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు పోలీసుల పట్ల భరోసా, నమ్మకాన్ని కలిగించాలని సూచించారు. ముఖ్యంగా నిరుపేద ప్రజలకు పోలీస్ అధికారులు అండగా నిలవాలని పదోన్నతి పొందిన ఏఎస్ఐలకు సీపీ పిలుపునిచ్చారు.

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును కలిసిన వరంగల్ నేతలు



**వరంగల్ వాయిస్, వరంగల్:** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్ర అధ్యక్షులుగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎన్. రాంచందర్ రావును శనివారం వరంగల్ జిల్లాకు చెందిన బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్ గందే కల్పన నవీన్ మరియు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు, రైల్వే జెడ్ఆర్ యూసీసీ మెంబర్ ఎరుకల రఘునారెడ్డి ఆయనను శాలువాతో సన్మానించారు.

# ఖిలా వరంగల్ అంబేద్కర్ నగర్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా మందపల్లి శ్రీనివాస్, వేల్పుల బాబు



**వరంగల్ వాయిస్, బొల్లికుంట:** వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలం, అంబేద్కర్ నగర్ శాఖ మహాసభను ఖిలా వరంగల్ మండలం అధ్యక్షులు జన్ను రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మహాసభకు వేల్పుల బాబు, వనపర్తి మహేందర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాష్ మియా,యు దళిత హక్కుల పోరాట సమితి వరంగల్ జిల్లా అధ్యక్షులు సంఘీ ఎలేందర్ హాజరయ్యారు. సమావేశంలో 21 మందితో కూడిన నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అంబేద్కర్ నగర్ శాఖ అధ్యక్షులుగా మందపల్లి శ్రీనివాస్‌ను, ప్రధాన కార్యదర్శిగా వేల్పుల బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ అంబేద్కర్ నగర్ శాఖ కార్యదర్శి వేల్పుల సువర్ణ, దళిత హక్కుల పోరాట సమితి వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి తాళ్లపల్లి జాన్ పాల్, ఖిలా వరంగల్ మండలం ప్రధాన కార్యదర్శి రాచర్ల రాజేందర్ పాల్గొన్నారు.

# పన్ను వసూళ్లపై సమీక్ష

## మేయర్, కమిషనర్ కీలక సూచనలు



**వరంగల్ వాయిస్, వరంగల్:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం పన్ను వసూళ్లపై సమీక్షా సమావేశం జరిగింది. నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి ఈ సమావేశంలో పాల్గొన్నారు. బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో నిర్వహించిన ఈ సమావేశంలో, పన్ను వసూళ్లను సమర్థవంతంగా నిర్వహించేందుకు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, రవీందర్, ఈఈ రవి కుమార్, పన్నుల అధికారి రామకృష్ణ, ఆర్.ఓ.లు యూసఫోద్దీన్, శ్రీనివాస్, షహజాది బేగం, ఆర్ఐలు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

## ◆ 9న దేశవ్యాప్త సమ్మెకు పిలుపు



**వరంగల్ వాయిస్, వరంగల్:** కేంద్రంలోని బీజేపీ ఎన్డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేసి, కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేయాలని, లేనిపక్షంలో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఏఐకేఎఫ్ జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్రావు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం ఎంసీపీఐ జిల్లా కార్యాలయంలో పానుగంటి నరసయ్య అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. చందర్రావు మాట్లాడుతూ, చికాగో నగరంలో అమరవీరుల త్యాగాలతో, మేడే స్ఫూర్తిగా కార్మికులు వంద సంవత్సరాలలో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం రద్దు చేసిందని, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని విమర్శించారు. ఈ లేబర్ కోడ్‌లు కార్పొరేట్ కంపెనీలకు కార్మికులను బానిసలుగా మార్చే నల్ల చట్టాలని, కార్మిక, కర్షక, ప్రజా హక్కుల అణచివేతకు, ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాల అమలును తీవ్రతరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్డీఏ మద్దతుతో ఏర్పడిన రాష్ట్రాల ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ, జులై 9న జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన దేశవ్యాప్త సమ్మెకు కార్మికులు, కర్షకులు, చేతివృత్తుల వారు, విద్యార్థులు, మేధావులు, యువతీ యువకులు, మహిళలు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని తమ హక్కులను కాపాడుకోవాలని ఎంసీపీఐ, ఏఐకేఎఫ్, ఏఐసీటీయూ, యూఎస్ఎఫ్ఐ సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన పలు డిమాండ్లను మోర్తాల చందర్రావు ప్రస్తావించారు. ఈ సమావేశంలో ఎంసీపీఐ కేంద్ర కమిటీ సభ్యులు సింగతి సాంబయ్య, ఎంసీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు మాలోత్ రాజేష్ నాయక్, ఎంసీపీఐ నాయకులు భాషిపాక రమేష్, రోహిత్, ఆదినారాయణ, రాజమౌళి, ప్రభాకర్, నర్సింగం పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు వామపక్షాల మద్దతు




**వరంగల్ వాయిస్, వరంగల్:** ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం, కార్మికుల హక్కుల సాధన కోసం ఈ నెల 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి అన్ని రంగాల ఉద్యోగులకు, కార్మికులకు పిలుపునిచ్చారు. శనివారం సీపీఐ జిల్లా కార్యాలయం తమ్మెర భవన్‌లో జరిగిన వామపక్షాల సంయుక్త సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మేకల రవి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం గత పదకొండు సంవత్సరాలుగా కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. అనేక దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న నలభై నాలుగు కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కోడ్‌లను ఏర్పాటు చేయడం ద్వారా కార్మిక వర్గానికి తీరని ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. మోడీ పాలన పూర్తిగా పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు అనుకూలమైన విధానాలను రూపొందిస్తోందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, ప్రైవేటుకరిస్తూ, అమ్మేస్తూ అంబానీ, అదానీలకు కారు చౌకగా కట్టబెడుతున్నారని, ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడం లేదని రవి అన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం, రైతుల సంక్షేమం కోసం, అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం మోడీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా అన్ని జాతీయ కార్మిక సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెను ఈ నెల 9న జయప్రదం చేయాలని సంఘటిత, అసంఘటిత రంగ ఉద్యోగులకు, కార్మికులకు పిలుపునిచ్చారు. సమ్మెను జయప్రదం చేయడంలో భాగంగా ఈ నెల జులై 8న సోమవారం వరంగల్ చౌరస్తాలో అన్ని వామపక్ష పార్టీలతో కలిసి సమ్మెకు సంఘీభావంగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక వర్గ శ్రేయోభిలాషులు, రైతు పక్షపాతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం కొనసాగిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిలిపివేయాలని, లేదంటే రానున్న రోజుల్లో అన్ని కార్మిక సంఘాలు, అన్ని కమ్యూనిస్టు పార్టీలు ఏకమై ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశానికి న్యూ డెమోక్రసీ పార్టీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు అధ్యక్షత వహించగా, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సింగారపు బాబు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎలకంటి రాజేందర్, ఎంసీపీఐ (యూ) జిల్లా సహాయ కార్యదర్శి నర్రా ప్రతాప్, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి, ఎంసీపీఐ (యూ) నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్, ఆర్ఎస్‌పీ నాయకులు వల్లందాసు కుమార్, సీపీఐ నాయకులు జన్ను రవి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


# మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాలు



**వరంగల్ వాయిస్, వరంగల్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వినాశనకర విధానాలతో మహిళల జీవితాలు అతలాకుతలం అవుతూ, వేధింపులు, అఘాయిత్యాలు, ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఏఐఎఫ్‌డీడబ్ల్యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగాల రాగసుధ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం వరంగల్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షురాలు ఘటికే మమత అధ్యక్షతన స్థానిక ఓంకార్ భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వంగాల రాగసుధ మాట్లాడుతూ, సమాజంలో సగభాగమైన మహిళలను విలాస వస్తువుగా చూస్తూ, కనీస భద్రత కల్పించలేని దుస్థితికి నెట్టివేశారని ఆరోపించారు. కుటుంబ వ్యవస్థలో కీలక భూమిక పోషించే మహిళలు పాలకుల విధానాలతో పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలతో కనీస అవసరాలు తీర్చుకోలేని పరిస్థితిలో ఉన్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు, ఆడవాళ్లపై అఘాయిత్యాలు పెంచి పోషించే విధంగా పాశ్చాత్య సంస్కృతిని విస్తృతంగా తీసుకువస్తున్నారని, మత్తు పదార్థాలను యువతకు అందిస్తూ తప్పుదోవ పట్టే విధంగా ప్రోత్సహిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తూ ఎన్నికల్లో అనేక ఆశాజనకమైన హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా మహిళలను కించపరుస్తున్నారని రాగసుధ విమర్శించారు. ఇప్పటికైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, మహిళా వ్యతిరేక విధానాలకు స్వస్తి పలికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా అర్హులైన ప్రతి మహిళకు నెలకు రూ.2,500 నగదు, వడ్డీ లేని రుణాలు, ఇతర హామీలను తక్షణమే అమలు చేయాలని కోరారు. మహిళా సమస్యలపై రాజకీయాలకతీతంగా ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఏఐఎఫ్‌డీడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కనకం సంధ్య మాట్లాడుతూ, ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో అనేక ప్రాంతాలలో దోమలు, ఈగలు ప్రబలుతున్నాయని, మురికి పేరుకుపోవడంతో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో తక్షణమే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే, ప్రైవేటు ఆసుపత్రుల్లో కనీస వసతులు లేకపోయినా రోగుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, అలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు పేరబోయిన రమ, జిల్లా నాయకులు పెండ్యాల లలిత, మార్త సుధా, జన్ను విజయ, జమున, యమున పాల్గొన్నారు.



కథానాయకుడు ప్రభాస్ 'ది రాజాసాబ్' చిత్రీకరణను ముగించే పనిలో ఉన్నారు. అలాగే ప్రభాస్‌తో హను రాఘవపూడి చేస్తోన్న చిత్రాన్ని చకచకా పరుగులు పెట్టిస్తున్నారు. ఇక ఇప్పుడు మరోవైపు 'స్పిరిట్'ను పట్టాలెక్కించేందుకు జోరుగా సన్నాహాలు చేసుకుంటున్నారు. 'యానిమల్' విజయం తర్వాత సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న బహుభాషా చిత్రమిది. భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్స్, టీ-సిరీస్ ఫిల్మ్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. త్రిప్తి దిమ్రి కథానాయిక. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమాని సెప్టెంబరు నుంచి సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు- సమాచారం. ఇప్పటికే దీని కోసం ప్రభాస్ బల్క్ డేట్స్ కేటాయించినట్లు- సమాచారం ప్రస్తుతం దీనికి తగ్గట్లు-గానే పూర్వ నిర్మాణ పనుల్ని వేగవంతం చేసినట్లు తెలిసింది. హైఓల్టేజ్ కాప్ యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమాలో ప్రభాస్ శక్తిమంతమైన పోలీసు పాత్రలో కనువిందు చేయనున్నారు. దీన్ని తొమ్మిది భాషల్లో ప్రపంచవ్యాప్తంగా ఒకేసారి విడుదల చేయనున్నారు.




# రాజాసాబ్ ముగింపులో ప్రభాస్

## ఓ భామ అయ్యో రామ అంటోన్న సుహాస్ ..

సినిమా సినిమాకు డిఫరెంట్ కథలను ఎంచుకుంటూ దూసుకెళ్తున్న కథానాయకుడు సుహాస్ తాజాగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ 'ఓ భామ అయ్యో రామ'. మలయాళంలో జో అనే చిత్రంతో అందరి హృదయాలను దోచుకున్న నటి మాళవిక మనోజ్ ఈ చిత్రంతో తెలుగులో కథానాయికగా పరిచయమవుతోంది. రామ్ గోధ దర్శకుడు. వీ ఆర్ట్స్ పతాకంపై హరీష్ నల్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రముఖ కథానాయకుడు రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా ఈ చిత్రాన్ని విడుదల చేయనుంది. జులై 11న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ చిత్రం నుంచి తాజాగా మేకర్స్ థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు. సుహాస్ ఎంతో ఎనర్జీగా కనిపించాడు. హీరోయిన్ మాళవిక, హీరో సుహాస్ మధ్య వచ్చే సన్నివేశాలు ఎంతో వినోదాన్ని పంచాయి. ఇక ఈ చిత్రంలో దర్శకులు హరీశ్ శంకర్, మారుతి అతిథి పాత్రల్లో మెరవబోతున్నారు.





## హీరోగా వస్తున్న టూరిస్ట్ ఫ్యామిలీ డైరెక్టర్

టూరిస్ట్ ఫ్యామిలీ సినిమాతో మొదటి చిత్రంతోనే బ్లాక్ బస్టర్ అందుకున్నాడు దర్శకుడు అభిషన్ జీవింత్. శశి కుమార్, సిమ్రాన్ ప్రధాన పాత్రల్లో వచ్చిన ఈ చిత్రం తమిళంలో రూ.100 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అయితే ఈ సినిమా తర్వాత అభిషన్ మరో సినిమాను తెరకెక్కిస్తాడు అనుకుంటే హీరోగా ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. ఇందుకు సంబంధించిన వార్తలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. అభిషన్ హీరోగా అరంగేట్రం చేయబోతున్న ఈ సినిమాకు 'కరెక్టెడ్ మచ్చి' అనే టైటిల్ పెట్టినట్లు తెలుస్తుంది. ఇందులో మలయాళ నటి అనస్వర రాజన్ హీరోయిన్‌గా నటించబోతున్నట్లు- సమాచారం. అభిషన్ జీవింత్ 'టూరిస్ట్ ఫ్యామిలీ' సినిమాలో ఒక చిన్న పాత్రలో నటించిన విషయం తెలిసిందే. చేసింది చిన్న పాత్రే అయిన తన నటనతో అందరిని మెప్పించాడు. అయితే ఇప్పుడు పూర్తిస్థాయి నటుడిగా మారుతుండడంతో ఈ ప్రాజెక్ట్‌పై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. 'కరెక్టెడ్ మచ్చి' సినిమాకు టూరిస్ట్ ఫ్యామిలీ చిత్రానికి కో-డైరెక్టర్‌గా పనిచేసిన అభిషన్ సహచరుడు దర్శకత్వం వహించనున్నారని టాక్. ఈ ప్రాజెక్ట్ ప్రారంభ దశలో ఉందని, త్వరలో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సమాచారం. అనస్వర రాజన్ సూపర్ శరణ్, థగ్స్, రేఖచిత్రం, పైంకిలి వంటి చిత్రాలతో గుర్తింపు పొందింది.



## ఫిష్ వెంకట్‌కు ప్రభాస్ సాయంఅంటూ ప్రచారం

అదంతా ఉత్తిదే అని కొట్టి పారేసిన కుటుంబం తన భర్త ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తోందని, దీనస్థితిలో ఉన్న తమను ఆదుకోవాలంటూ నటుడు ఫిష్ వెంకట్ భార్య సువర్ణ కోరుతున్నారు. వెంకట్ నాలుగేళ్లుగా రెండు కిడ్నీలూ చెడిపోవడంతో డయాలసిస్ ద్వారా చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఆయన బోడుప్పల్‌లోని ఆర్బీఎం ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. అయితే వెంకట్ ఆరోగ్య పరిస్థితిపై నటుడు ప్రభాస్ స్పందించి రూ.50లక్షలు ఆర్థిక సాయం అందించారని వస్తున్న వార్త అవాస్తవమని ఆయన భార్య సువర్ణ తెలిపారు. ప్రభాస్‌కు ఈ విషయం తెలియక పోవచ్చని.. తెలిస్తే తమకు తప్పకుండా సాయం చేస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సినీ పెద్దలు, దాతలు ముందుకు వచ్చి తన భర్తను కాపాడాలని కోరారు. తీవ్ర అనారోగ్యంతో టాలీవుడ్ సహాయ నటుడు ఫిష్ వెంకట్ ప్రస్తుతం కిడ్నీ సంబంధిత సమస్యలతో ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఆయనకు తప్పనిసరిగా కిడ్నీ మార్పిడి చేయాల్సి ఉండగా... ఆపరేషన్‌కు రూ.50 లక్షల వరకూ ఖర్చవుతుందని వైద్యులు తెలియజేశారు. అయితే ఎవరైనా దాతలు ఉంటే సాయం చేయాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. వెంకట్ కుమార్తె సహా కుటుంబ సభ్యులు ఇప్పటికే పలుమార్లు ఆర్థిక సహాయం కోరినప్పటికీ, సినీ పరిశ్రమ నుంచి పెద్దగా స్పందన రాలేదట. కుటుంబం చేసిన విజ్ఞప్తికి గబ్బర్ సింగ్ గ్యాంగ్ (కొంతమంది సహనటులు) మాత్రమే స్పందించారని, మిగిలిన వారు ఎవరు కూడా రెస్పాండ్ కాలేదని వార్తలు వచ్చాయి. అయితే ప్రముఖ హీరో ప్రభాస్ ఫిష్ వెంకట్‌కు రూ. 50 లక్షల సాయం ప్రకటించారని స్థానిక, జాతీయ మీడియాల్లో వార్తలు వచ్చాయి. ఆపరేషన్‌కి కావల్సిన సాయం అందిస్తామని ప్రభాస్ టీం నుండి ఒకరు కాల్ చేసినట్టు జోరుగా ప్రచారాలు అయితే నడిచాయి. దీనిపై కొందరు ప్రభాస్ టీమ్‌ని వివరణ కోరగా, తాము కాల్ చేయలేదని, ఏదైన విషయం ఉంటే మీడియా ద్వారా తెలియజేస్తామని అన్నారట. దీంతో ప్రభాస్ సాయంకి సంబంధించి వచ్చిన వార్తలు అన్నీ ఫేక్ అని తేలింది. దాతలు ఎవరైనా ఉన్నారేమోనని డోనర్ సంస్థలను సంప్రదిస్తున్నాం అని కుటుంబ సభ్యులు తెలియజేశారు. ఫిష్ వెంకట్ విలన్, హాస్య పాత్రలతో ప్రేక్షకులకి మంచి వినోదాన్ని పంచారు.. గబ్బర్ సింగ్, బన్నీ, దిల్, నాయక్, అత్తారింటికి దారేది, డీజే టిల్లు, అదుర్స్, ఢీ, మిరపకాయ్ వంటి హిట్ సినిమాలలో నటించి మంచి పేరు తెచ్చుకున్నారు. ఇటీ-వల ఆహాలో రిలీజ్ అయిన 'కాఫీ విత్ ఎ కిల్లర్' మూవీలో కూడా నటించి అలరించారు. అలాగే, 'మా వింత గాధ వినుమా' మూవీలో కనిపించి సందడి చేశారు.

# స్నాతకోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

- 7వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రారంభం
- హాజరు కానున్న గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- ప్రెస్ మీట్ లో వివరాలు వెల్లడించిన వీసీ ప్రతాప్ రెడ్డి



**వరంగల్ వాయిస్, కేయూ :** ఈ నెల 7వ తేదీ సోమవారం నిర్వహించనున్న కాకతీయ విశ్వవిద్యాలయం 23 వ స్నాతకోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల వెల్లడించారు. మధ్యహ్నం విశ్వవిద్యాలయ సెనెట్ హాల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్నాతకోత్సం వివరాలను వెల్లడించారు. రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ ఛాన్సలర్ జిష్ణు దేవ్ వర్మతోపాటు ముఖ్య అతిథిగా శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత, ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న స్నాతకోత్సవంలో ఆర్ట్స్ ఫాకల్టీలో 60 గోల్డ్ మెడల్ లు, 56 పీహెచ్ డీలు, సైన్సు ఫాకల్టీలో 161 గోల్డ్ మెడల్ లు, 96 పీహెచ్ డీలు, ఫార్మసీ ఫాకల్టీలో 48 గోల్డ్ మెడల్ లు, 21 పీహెచ్ డీలు, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ ఫాకల్టీలో 66 గోల్డ్ మెడల్ లు, 49 పీహెచ్ డీలు, సోషల్ సైన్సెస్ ఫాకల్టీలో 88 గోల్డ్ మెడల్ లు, 133 పీహెచ్ డీలు, ఎడ్యుకేషన్ ఫాకల్టీలో 25 గోల్డ్ మెడల్ లు, 18 పీహెచ్ డీలు, లా ఫాకల్టీలో 72 గోల్డ్ మెడల్ లు, 4 పీహెచ్ డీలు, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఫాకల్టీ లో 44 గోల్డ్ మెడల్ లు, 10 పీహెచ్ డీలు, ఇలా మొత్తం 564 గోల్డ్ మెడల్ లు, 387 పీహెచ్ డీలు ప్రధానం చేస్తునట్టు సమావేశంలో వెల్లడించారు. అకడమిక్ సెనెట్ సమావేశంతో స్నాతకోత్సవం ప్రారంభమవుతుందన్నారు. అనంతరం గవర్నర్, ముఖ్య అతిథి, వీసీ, రిజిస్ట్రార్, పూర్వపు ఉపకులపతులు, కంట్రోలర్, డీన్స్, పాలకమండలి సభ్యులు, సెనేట్ సభ్యులతో కలిసి గ్రూప్ ఫొటో తీసుకుంటారని తెలిపారు. ఆ తర్వాత సెనేట్ సభ్యుల పొసేషన్ నిర్వహించబడుతుందని, వెంటనే బంగారు పతకాలు, పట్టాల పంపిణీ కార్యక్రమం ఆడిటోరియంలో జరుగుతుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 1:15 గంటలకు స్నాతకోత్సవ కార్యక్రమం ముగియనుందని వెల్లడించారు. ఈ వేడుకను అన్ని విభాగాల సహకారంతో విజయవంతంగా నిర్వహించాలనే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, కార్యక్రమ నిర్వహణ కొరకు ఒక స్టీరింగ్ కమిటీతో పాటు మొత్తం 10 సబ్ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి కమిటీలో కన్వీనర్, కో కన్వీనర్ లతో పాటు బాటు 10 మంది సభ్యులు ఉన్నారని, టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులతో కలిపి వేసిన ఈ కమిటీలు కష్టపడి స్నాతకోత్సవం విజయవంతంగా నిర్వహించడానికి కృషి చేస్తున్నారని వీసీ అన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, సిబ్బంది సహకరించి కార్యక్రమాన్ని గౌరవప్రదంగా నిలబెట్టాలని కోరారు. ఈ ప్రెస్ మీట్ లో రిజిస్ట్రార్ ప్రో రామచంద్రం, కంట్రోలర్ ప్రో కట్ల రాజేందర్ పాల్గొన్నారు.ఇందుకోసం వివిధ కమిటీ లు గత వారం రోజులుగా పని చేస్తునట్టు వెల్లడించారు.

## నో పర్మిషన్..

కాకతీయ విశ్వవిద్యాలయ 23వ స్నాతకోత్సవం దృష్ట్యా ఆదివారం, సోమవారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో వాకర్లకు, ఇతరులకు ప్రవేశం ఉండదని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం ఒక అధికారిక సర్కులర్ ద్వారా తెలియజేశారు. స్నాతకోత్సవ ఏర్పాట్లను దృష్టిలో ఉంచుకుని ఈ ఆదేశాలను విధిగా పాటించాలని ఆయన కోరారు.

# ఆదర్శంగా నిలవాలి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలో అవలంబించే శానిటేషన్ విధానాలు ఇతర మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలవాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అభిప్రాయపడ్డారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్ లో సానిటేషన్, మలేరియా విభాగ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో కమిషనర్ పాల్గొని సమర్థవంతంగా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సానిటేషన్ కు సంబంధించి 100 శాతం ప్రతి గృహం నుంచి చెత్త సేకరణ జరపడంతో పాటు తడి, పొడి చెత్తను వేరుగా అందించేలా చూడాలని, ప్రతి వార్డులో కంపోస్ట్ యూనిట్ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, వరంగల్ ను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడానికి సమర్థవంతమైన శానిటేషన్ పద్ధతులను అవలంబించాలన్నారు. బయోమెట్రిక్ అటెండెన్స్ విధానం నూతనంగా తీసుకొచ్చిన పద్ధతి కాదని గతంలో అమల్లో ఉందని, దానిని సమర్థంగా నిర్వహించి పారిశుధ్య సిబ్బంది సక్రమంగా విధి నిర్వహణ చేసే విధంగా చూడాలని, వారికి అవసరమైన పనిముట్లతో పాటు గ్లవుజులు సమకూర్చడం జరుగుతుందన్నారు. పబ్లిక్ టాయిలెట్ నిర్వహణకు సంబంధించిన అప్లికేషన్(ఆప్) పనిచేయడం లేదని, రెగ్యులర్ గా మానిటరింగ్ చేయాలని, అట్టి ఆప్ ను వెంటనే సరి చేసి ప్రజా మరుగుదొడ్లను పనిచేసెలా చూస్తూ ఆప్ ను ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పేమెంట్ చేసే, సర్టిఫికేషన్ చేసివి సక్రమంగా పని చేస్తున్నాయా లేదా అని పరిశీలించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'నమస్తే' కార్యక్రమం ప్రొఫైల్ ను పూర్తి చేసి అందుకు కావలసిన నైపుణ్యాలపై అవగాహన కలిగించాలని సానిటరీ ఇన్ స్పెక్టర్లను ఆదేశించారు. ప్లాస్టిక్, ఐఈసీకి సంబంధించి కార్పొరేషన్ సహకారంతో ప్రజలలో అవగాహన కలుగజేయాలని, ప్లాస్టిక్ ఎన్ఫోర్స్ మెంట్ బృందాలను బలోపేతం చేసి కమర్షియల్ ప్రాంతాలలో రెండు చెత్త డబ్బాలను ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. ప్లాస్టిక్ తో కలిగే అనర్థాలను ప్రజలకు వివరించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను వినియోగించకుండా ప్రోత్సహించాలని, ట్రేడ్ లైసెన్స్ వసూళ్లకు సంబంధించి సూచించిన డిమాండ్ ను కచ్చితంగా వసూలు చేయాలని, డిలీషన్ షాపులు ఏమైనా ఉంటే క్రాస్ వెరిఫికేషన్ చేసుకున్న తర్వాతే తొలగించాలని అన్నారు. వర్షాకాలం నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలలో నీరు నిలవకుండా చూడాలని ఏ ప్రాంతాల్లో డ్రైన్లు బ్లాక్ అవుతాయో గుర్తించి అలాంటి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు తొలగింపు ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రూపొందించిన అవగాహన స్టిక్కర్లను ఆయా గృహాలకు అతికించాలని ఈ సందర్భంగా కమిషనర్ శానిటేషన్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, వెటర్నరీ వైద్యులు డాక్టర్ గోపాల్ రావు, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, సానిటరీ సూపర్ వైజర్లు భాస్కర్, నరేందర్, ఐటీ మేనేజర్ రమేష్, సానిటరీ ఇన్ స్పెక్టర్లు, హెల్త్ ఇన్ స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



# కూనంనేనికి సన్మానం

**వరంగల్ వాయిస్, కురవి :** భారత కమ్యూనిస్టు పార్టీ మహాసభల సందర్భంగా శనివారం కురవి మండల కేంద్రానికి విచ్చేసిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావును కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు దూదికట్ల సారయ్య ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించారు. కూనంనేని పార్టీ నేతలతో కలిసి సారయ్య నివాసానికి వెళ్లారు. 40 ఏళ్లుగా కమ్యూనిస్టు పార్టీకి సారయ్య చేసిన సేవలు అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ సర్వేష్, సత్యం, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అది ఫేక్ లేఖ

- మంత్రి సీతక్కపై ఎలాంటి లేఖ విడుదల చేయలేదు
- దామోదర్ లొంగిపోతాడనేది బూటకం
- మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్



**వరంగల్ వాయిస్, క్రైం :** మంత్రి సీతక్కపై తాము ఎలాంటి లేఖను విడుదల చేయలేదని, అది ఫేక్ లేఖ అంటూ మావోయిస్టు అధికార ప్రతినిధి జగన్ తేల్చి చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ ను వ్యతిరేకిస్తోందని వెల్లడించారు. అదేవిధంగా తెలంగాణ మావోయిస్టు రాష్ట్ర కమిటీకి చెందిన దామోదర్ లొంగిపోతాడనే వార్తల్లో ఏమాత్రం నిజం లేదని అది బూటకపు ప్రచారం అని ఆయన కొట్టిపారేశారు. జూన్ 1 నుంచి వివిధ పత్రికలు, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం నిజం కాదన్నారు. ఈ మేరకు జగన్ పేరుతో మీడియాకు ఓ లేఖను విడుదల చేసారు. జూన్ 1వ తేదీన తెలంగాణ రాష్ట్ర కమిటీ నాయకుడు దామోదర్ లొంగిపోతున్నట్లు దిన పత్రికలు, సోషల్ మీడియాలలో విస్తృత ప్రచారం చేశారని, ఈ ప్రకటనలలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. పోలీసులే ఉద్దేశ పూర్వకంగా ఈ దుష్ప్రచారం చేస్తున్నారని లేఖలో ఆరోపించారు. గతంలో కూడా దామోదర్ ఎన్ కౌంటర్లలో మృతి చెందినట్లు, లొంగిపోతున్నట్లు అనేక సార్లు ప్రచారం చేశారని గుర్తు చేశారు. విప్లవ ప్రజలను గందరగోళ పరచడానికి మానసిక యుద్ధంలో భాగంగానే ఈ దుష్ప్రచారం కొనసాగుతోందని లేఖలో పేర్కొన్నారు. అదేవిధంగా ఇటీవల మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ పేరుతో గత నెల 26న మంత్రి సీతక్కపై వచ్చిన పత్రిక ప్రకటనకు మా పార్టీకి ఎలాంటి సంబధం లేదన్నారు. మావోయిస్టు పార్టీ సమస్య సామాజిక, రాజకీయ సమస్యని, అణిచివేతల ద్వారా పార్టీని నిర్మూలించడం సరైనది కాదనీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన సంగతి ప్రజలందరికీ తెలిసిందే. ఇది ఇలా ఉంటే తెలంగాణాలో మావోయిస్టు పార్టీ కార్యకలాపాలు లేకపోయినప్పటికీ పోలీసులు మాత్రం మావోయిస్టు పార్టీకి ప్రజలు ఎలాంటి సహకారాన్ని అందించకూడని, సహకరించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామని, మావోయిస్టు పార్టీ వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఆసిఫాబాద్ జిల్లాలలో అమాయక ఆదివాసి ప్రజలను పోలీస్ స్టేషన్ లకు పిలిచి బెదిరింపులకు గురి చేస్తున్నారు. ఇది తెలంగాణ ప్రజలు గమనించాలని జగన్ ఆ లేఖలో కోరారు.

# మందుబాబులకు జైలు శిక్ష

- వారంలో 31మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు
- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్



**వరంగల్ వాయిస్, క్రైం :** మద్యం సేవించి వాహనం నడపడం ద్వారా గత వారం రోజుల్లో 31 మంది వాహనదారులు జైలు శిక్ష అనుభవించారని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో నెల 28 వ తేది నిన్నటి రోజు వరకు వారం ట్రైసిటి ట్రాఫిక్ పోలీసులు ముమ్మరంగా జరిపిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనీఖీల్లో మొత్తం 376 కేసులు నమోదు కాగా, ఇందులో 31 మందికి వాహనదారులకు జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇవ్వగా, 3లక్షల 83వేల రూపాయలు వాహనదారులపై ఫైన్ రూపంలో కోర్టులో జరిమానాలు చెల్లించారని పోలీస్ కమిషనర్ వెల్లడిరచారు. నమోదైన కేసుల్లో అత్యధికంగా హన్మకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 138 కేసులు నమోదు కాగా ఇందులో 10 మందికి జైలు శిక్ష పడగా, 96వేల ఎనిమిది వందల రూపాయల్లో వాహనదారులు కోర్టు లో జరిమానా చెల్లించారు. ఇదే రీతిలో వరంగల్ పరిధిలో 134కేసుల్లో 15మంది కి జైలు శిక్ష, 1లక్ష 77వేల ఒక వంద రూపాయల జరిమానా, కాజీపేట పరిధిలో మొత్తం 104 కేసులు నమోదు కాగా ఇందులో అరుగురికి జైలు శిక్ష పడగా, మిగితా కేసుల్లో మొత్తం ఒక లక్ష 9వేల వందల రూపాయలు జరిమానా చెల్లించారని పోలీస్ కమిషనర్ వెల్లడించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ వాహన దారులకు సూచన చేస్తూ మీ కుటుంబాన్ని దృష్టిలో వుంచుకొని వాహనదారులు మద్యం సేవించి వాహనం నడపవద్దని, మీరు చేసే తప్పిదాలతో ఇతరులు కూడా ప్రాణాలు కోల్పోయినవారు కొందరైతే మరి కొందరు అంగవైకల్యంగా జీవితాలను కొనసాగిస్తూన్నారన్నారు. ఇకనైన వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com